సాక్షి
పశ్చిమగోదావరి

బుధవారం । 4 । డిసెంబర్ । 2024



దొంగల హల్‌చల్

నూజివీడు పట్టణంలో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. ఎంప్లాయీస్ కాలనీలో సోమవారం అర్ధరాత్రి ఒక ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. 8లో ▸



లక్ష్యం మేరకు చేపనారు ఉత్పత్తి

చేపనారు ఉత్పత్తిలో రాష్ట్రంలోనే పేరొందిన బాదంపూడి ప్రభుత్వ మత్స్య కేంద్రంలో ఈ ఏడాది లక్ష్యం మేరకు చేపనారు ఉత్పత్తి చేశారు. 8లో ▸



అంతర్రాష్ట్ర నేరస్తుడి అరెస్టు

ప్రకాశం జిల్లాలో అంతర్రాష్ట్ర నేరస్తుడిను అరెస్ట్ చేశారు. ఇతనిపై విశాఖపట్నం, గుంటూరు, పశ్చిమ గోదావరి ప్రాంతాల్లో 20 కేసులు నమోదయ్యాయి. 8లో ▸

న్యూస్‌రీల్

మావుళ్లమ్మ హుండీ ఆదాయం రూ.71.11 లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): మావుళ్లమ్మ అమ్మవారి హుండీలను మంగళవారం లెక్కించగా రూ.71,11,207 ఆదాయం లభించినట్లు ఆలయ సహాయ కమిషనర్ మహాలక్ష్మీ నగేష్ తెలిపారు. 3 నెలల్లో భక్తులు అమ్మవారికి సమర్పించిన కానుకలను లెక్కించగా పైఆదాయం వచ్చిందన్నారు. బంగారం 133.5 గ్రాములు, వెండి 880 గ్రాములు, అమెరికా డాలర్లు 56, యుఏఈ దిర్హామ్స్ 105, కెనడా డాలర్లు 5 డాలర్లు, బ్రిటన్ పౌండ్లు 10 వచ్చినట్లు తెలిపారు.

6 నుంచి రెవెన్యూ సదస్సులు

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో ఈ నెల 6 నుంచి జనవరి 10 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి ఆమె తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులను జిల్లాలో జయప్రదంగా నిర్వహించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో తప్పనిసరిగా పర్యటించాలన్నారు. సమన్వయంతో పనిచేసినప్పుడే ప్రభుత్వ లక్ష్యాలను చేరుకుంటామన్నారు. పీజీఆర్ఎస్‌లో అర్జీల పరిశీలన పక్కాగా ఉండాలన్నారు. బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలన్నారు. శాసనమండలి ఎన్నికల నిర్వహణకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతుల నుంచి నీటి తీరువా పన్నులు వసూలు చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సుబ్బారాయుడి కల్యాణోత్సవాలకు సిద్ధం

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్ర ఉపాలయమైన శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం కల్యాణోత్సవాలకు ముస్తాబైంది. ఆలయం, పరిసరాలు విద్యుత్ అలంకారాలతో మిరమిట్లు గొలుపుతున్నాయి. ఇప్పటికే అన్ని పనులు పూర్తి కాగా, ఆలయ ముఖ ద్వారాలను ముస్తాబు చేసే పనులు తుదిదశకు చేరుకున్నాయి. ఈ నెల 4 నుంచి 10 వరకు జరిగే కల్యాణోత్సవాల్లో భాగంగా, తొలిరోజు ఉదయం 9.30 గంటలకు అర్చకులు స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలు చేస్తారు. 5న పుణ్యహవాచనం, అంకురార్పణ, రాత్రి ధ్వజారోహణ, అగ్ని ప్రతిష్ఠాపన, 6న స్వామి వారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, నిత్యోపాసన నిర్వహిస్తారు. 7న రాత్రి 7 గంటల నుంచి ఆలయం వద్ద శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరుగనుంది. 8న అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, నిత్యోపాసన, సాయంత్రం నెమలి వాహనంపై గ్రామోత్సం, 9న స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, నిత్యోపాసన, బలిహరణ, పూర్ణాహుతి, అవభృథస్నానం, వసంతోత్సవం, ధ్వజావరోహణ వేడుకలను నిర్వహిస్తారు. 10న సుబ్రహ్మణ్యేశ్వరునికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, ద్వాదశి ప్రదక్షిణలు, శ్రీ పుష్పయాగోత్సవ వేడుకలతో ఉత్సవాలు పరిసమాప్తం అవుతాయి.

9 వరకు పట్టభద్రుల ఓటు నమోదుకు అవకాశం

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పట్టభద్రుల (గ్రాడ్యుయేట్) ఓటు నమోదుకు ఈ నెల 9 వరకు అవకాశం ఉన్నట్లు జిల్లా ఎన్నికల సూపరింటెండెంట్ ఎం.సన్యాసిరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఇంతవరకు జిల్లా వ్యాప్తంగా 60,816 మంది ఓటుకు నమోదు చేసుకున్నారన్నారు. ఈ నెల 9 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తుది జాబితాను ఈ నెల 30న విడుదల చేస్తామన్నారు. ఇంతవరకు నమోదయిన ఓట్లలో 25,392 మంది మహిళలు, 35,419 మంది పురుషులు, ట్రాన్స్‌జెండర్స్ ఐదుగురు ఉన్నట్లు తెలిపారు.

పలువురు జడ్జిల బదిలీ

ఏలూరు (టూటౌన్): రాష్ట్ర వ్యాప్తంగా 17 మంది సీనియర్ సివిల్ జడ్జిలను బదిలీ చేశారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో ఇద్దరు జడ్జిలను బదిలీ చేయగా భీమవరంలో ఖాళీగా ఉన్న స్థానంలో కొత్తగా జడ్జిని నియమించారు. ఏలూరులో ప్రిన్సిపల్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న ఎస్.వాసుదేవ్‌ను అనకాపల్లి సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. భీమవరం సివిల్ జడ్జిగా కృష్ణా జిల్లా గుడివాడలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న ఎంఎస్ సుధారాణిని నియమించారు. నూజివీడులో ప్రిన్సిపల్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న కె.హరిబాబును గుంటూరుకు బదిలీ చేశారు.

సంక్రాంతి మూడు రోజుల్లో ఎంతోమంది జీవితాలను ఛిన్నాభిన్నం చేసే ఈ పందేల జూదం ఇప్పుడు ఎప్పుడు పడితే అప్పుడు నిర్వహిస్తుండటంతో సామాన్యుల జీవితాలపై ప్రభావం చూపిస్తోంది. పందేల మోజులో ఎంతోమంది తమ కష్టార్జితాన్ని కోల్పోతున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో కొన్నాళ్లుగా కోడిపందేలు నిర్వహిస్తున్నా, టీడీపీ నేతల ప్రమేయం ఉండడంతో పోలీసులు **చూసీచూడనట్లు వదిలేస్తున్నారు.**

బరితెగింపు



- జిల్లాలో యథేచ్ఛగా కోడి పందేలు
- గుట్టుచప్పుడు కాకుండా రహస్య ప్రదేశాల్లో బరుల ఏర్పాటు
- ఫోన్ల ద్వారా పందెంరాయుళ్లకు సమాచారం
- చేతులు మారుతున్న కోట్ల రూపాయలు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న పోలీసులు



దిరుసుమర్రులో పందెం పుంజులున్న సంచులతో పందెంరాయుళ్లు

సాక్షి, భీమవరం: కూటమి నేతలు బరితెగించారు. రహస్య ప్రదేశాల్లో బరులు ఏర్పాటుచేసి యథేచ్ఛగా కోడి పందేలు నిర్వహిస్తున్నారు. గుట్టుచప్పుడు కాకుండా తెల్లవార్లు సాగుతున్న ఈ పందేల్లో కోట్లాది రూపాయలు చేతులు మారుతున్నాయి. పోలీసులకు తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. సంక్రాంతికి బరులు ఏర్పాటుచేసి కోడి పందేలు నిర్వహించడం పరిపాటి. నిబంధనలకు విరుద్ధమే అయినా సంప్రదాయం మాటున బాహాటంగానే సాగిపోతుంటాయి. పండుగ మూడు రోజులు పోలీసులు బరుల వైపు కన్నెత్తి చూడరు. ఇది ఏటా జరిగేదే అయినా కూటమి అధికారంలోకి వచ్చాక ఎప్పుడుపడితే అప్పుడు.. ఎక్కడపడితే అక్కడ అన్నట్టుగా కూటమి నేతలు యథేచ్ఛగా కోడి పందేలు నిర్వహిస్తున్నారు. గత కొద్దిరోజులుగా భీమవరం, ఉండి నియోజకవర్గాల్లో, జిల్లాలోని ఏదొక చోట చిన్న స్థాయి నుంచి భారీ స్థాయిలో కోడి పందేలు సాగుతున్నాయి. రాత్రి పది గంటల నుంచి తెల్లవారే వరకు వీటిని నిర్వహిస్తున్నారు. ఏలూరు జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యేతో పాటు టీడీపీకి చెందిన ముఖ్యనేత ఒకరు కొన్ని పందేలకు హాజరై దగ్గరుండి జరిపించినట్టు తెలిసింది. జిల్లాకు చెందిన కొందరు ప్రజాప్రతినిధుల అండదండలుండటం, నిర్వాహకుల నుంచి భారీగానే ముడుపులు అందుతుండటంతో కోడి పందేల వైపు పోలీసులు కన్నెత్తి చూడటం లేదన్న ప్రచారం జరుగుతోంది.

రోజుకో చోట :

మొదట్లో ఉండిలోని మారుమూల ప్రాంతంలో కోడి పందేలు ఏర్పాటుచేయగా తర్వాత ఎమ్మార్పీ అగ్రహారంలో మూతపడిన ఓ ఫ్యాక్టరీ గోడౌన్ వద్ద పందేలు నిర్వహించారు. దీపావళి రోజున దొంగపిండి గ్రామంలోని చేపల చెరువుల వద్ద, ఇటీవల అధికార పార్టీ నేత పుట్టినరోజు వేడుకల్లో భాగంగా కాళ్ల మండలం సీసలిలోని తోటల్లో ఫ్లడ్ లైట్ల వెలుతురులో భారీ స్థాయిలో పందేలను నిర్వహించినట్టు సమాచారం. భీమవరం రూరల్ వెంప, శ్రీరాంపురం పరిసరాల్లో వారంలో మూడునాలుగు రోజులు పాటు తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి ఉదయం ఎనిమిది గంటల వరకు పందేలు నిర్వహిస్తున్నట్టు తెలిసింది. రెండు రోజుల క్రితం దిరుసుమర్రులో భారీ స్థాయిలో పందెం నిర్వహణకు ఏర్పాట్లు చేయగా పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. వారి ఆదేశాలతో పోలీసులు వస్తున్న సమాచారం తెలిసి పందెంరాయుళ్లు అక్కడి నుంచి జారుకున్నారు. పందెంరాయుళ్ల పందెం పుంజుల సంచులతో అక్కడికి నుంచి వెళ్లిపోతున్న వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఉండి మండల శివారు పాండవ సరిహద్దు ప్రాంతంలో పందేల సమాచారం తెలిసి స్థానిక పోలీసులు చేరే సరికి పందెంరాయుళ్లు అక్కడి గణపవరం సరిహద్దుల్లోకి పరారై అక్కడ నిర్వహించినట్టు తెలిసింది.

ఒకరోజు ముందే సమాచారం

విశ్వసనీయ సమాచారం మేరకు పందేలు ఎప్పుడు నిర్వహించేది ఒక రోజు ముందు పందెంరాయుళ్లకు నిర్వాహకులు ఫోన్ల ద్వారా సమాచారం అందిస్తున్నారు. ఏ గ్రామంలో ఎక్కడ జరిగేది పందెం రోజున తెలియజేస్తున్నారు. ఇందుకోసం ముఖ్యమైన వారితో ఒక వాట్సప్ గ్రూప్ క్రియేట్ చేసుకుని అందులో సమాచారం పెడుతున్నట్టు తెలుస్తోంది. జన సంచారం తక్కువగా ఉండే రహస్య ప్రదేశాల్లో బరులకు ఏర్పాట్లు చేస్తున్నారు. బారికేడ్లు, ఫ్లడ్‌లైట్ల కోసం అవసరమైన సామగ్రి, జనరేటర్లు సిద్ధంగా ఉంచుకుని పూటలోనే బరిని సిద్ధం చేస్తున్నారు. పెద్ద బరులకు వచ్చే వారికి ముందుగానే టోకెన్లు ఇవ్వడం ద్వారా అవి ఉన్న వారిని మాత్రమే లోపలికి అనుమతిస్తున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాతో పాటు రాజమహేంద్రవరం, కృష్ణా జిల్లా నుంచి పందెంరాయుళ్లు తరలివస్తున్నారు. పెద్ద బరిలో రాత్రి నుంచి తెల్లవారే వరకు 15 నుంచి 20 వరకు పందేలు జరుగుతుంటే, తెల్లవారుజాము నుంచి ఉదయం వరకు నిర్వహిస్తున్న చిన్న బరుల్లో ఆరేడు వరకు పందాలు నిర్వహిస్తున్నారు. పందెంతో పాటు పై బెట్టింగుల రూపంలో రూ.3 కోట్ల వరకు చేతులు మారుతున్నాయి. అధికారపార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి కోడిపందేల పట్ల పోలీసు యంత్రాంగం ఉదాసీనంగా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.

పదో తరగతి ఫలితాల్లో ప్రథమ స్థానం సాధించాలి

భీమవరం: టెన్త్ పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మంగళవారం భీమవరం పట్టణం బ్యాంకు కాలనీలోని శ్రీ కృష్ణ దేవరాయ సాంస్కృతిక సమితి, గన్నాబత్తుల తులసమ్మ పెదతాత కల్యాణ మండపంలో విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మార్చిలో జరగనున్న పరీక్షలపై ఇప్పటినుంచే ప్రత్యేక దృష్టి సారించాలని ప్రత్యేక క్లాసులు నిర్వహించి విద్యార్థులు ఏఏ సబ్జెక్టులో వెనుకబడి ఉన్నారో గుర్తించి ఆయా సబ్జెక్టులపై మంచి శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ నెల 7న నిర్వహించే విద్యార్థుల తల్లితండ్రులు, ఉపాధ్యాయులు సమావేశంలో తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, దాతలు, పూర్వ విద్యార్థులు, వివిధ స్వచ్ఛంద సంస్థలు, ఉపాధ్యాయులు కలిసి పాఠశాల అభివృద్ధికి, విద్యాభివృద్ధికి తీసుకోవల్సిన చర్యలపై చర్చలు జరిపి అమల్లోకి తీసుకు రావాలన్నారు. విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించడంతోపాటు వ్యవసాయ, ఆర్టికల్చర్, ఫిషరీస్ తదితర కోర్సులపై అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఇ.నారాయణ, అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ పి.శ్యామ్ సుందర్, జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి వై.చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీ.. బాదుడు గ్యారంటీ

మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ : బాబు ష్యూరిటీ–భవిష్యత్ గ్యారంటీ అంటూ ఎన్నికల్లో ప్రచారం చేసిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత వీర బాదుడు గ్యారంటీ అన్నట్లు వ్యవహరిస్తున్నారని మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ విమర్శించారు. తాడేపల్లిగూడెంలోని తన కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... అధికారంలోకి వచ్చిన తరువాత ఐదేళ్ల వరకు విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చిన చంద్రబాబు.. దానిని తుంగలో తొక్కి మొదటి దశలో యూనిట్‌కు రూ.1.27 చొప్పున అదనంగా చార్జీలు పెంచారన్నారు. 2025 జనవరి నుంచి సెకండ్ ఫేజ్‌లో యూనిట్‌కు రూ.2.17 చొప్పున పెంచనున్నారని తెలిపారు. దీనివల్ల ప్రజలపై రూ.87,500 కోట్ల భారం పడనుందని చెప్పారు. వైఎస్ జగన్‌మోహనరెడ్డి ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు విద్యుత్‌ను ఉచితంగా సరఫరా చేశారని, కూటమి ప్రభుత్వం ఆ పథకాన్ని రద్దు చేసిందన్నారు. చంద్రబాబు హయాంలో సోలార్ పవర్‌ను యూనిట్‌కు రూ.5.90కు కొనుగోలు చేసేందుకు ఒప్పందం చేసుకున్నారని, జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రూ.2.49కు కొనుగోలు చేసేందుకు ఒప్పందం చేసుకున్నారని తెలిపారు. దీనివల్ల యూనిట్‌కు రూ.3.41 ఆదా అయిందన్నారు. పచ్చ పత్రికలు బాబు చేసుకున్న ఒప్పందమే గొప్పదంటూ నిస్సిగ్గుగా ప్రచారం చేశాయని ఎద్దేవా చేశారు.

రూ.67 వేల కోట్లు ఏం చేశారు?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రూ.67వేల కోట్లు అప్పు చేసిందని కొట్టు అన్నారు. వీటిని ఏ పథకాలకు ఖర్చు చేశారో తెలపాలంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటాయని తెలిపారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయలేక చంద్రబాబు, పవన్ డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారని విమర్శించారు. ఇసుక ధర పెరగడంతో భవన నిర్మాణ రంగం నిలిచిపోయిందన్నారు. దీనివల్ల భవన నిర్మాణ కార్మికులు ఉపాధి లేక కుదేలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులు నిలిపివేయడంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. రైతులకు పంట బీమా చెల్లించకుండా మోసగించిందన్నారు. ధాన్యం కొనుగోలులో దళారుల వ్యవస్థను ప్రోత్సహించడంతో రైతులకు కనీస మద్దతు ధర దక్కని దుస్థితి ఏర్పడిందని చెప్పారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇంతవరకు ఇవ్వలేదని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తును 47.72 మీటర్ల నుంచి 41.15 మీటర్లకు ఎత్తుకు కుదిస్తూ కేంద్రం నిర్ణయానికి టీడీపీ ఆమోదం తెలపడం శోచనీయమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని చెప్పారు. మహిళలపై అత్యాచారాలు పెరిగిపోయాయన్నారు. హత్యలు పెరిగాయన్నారు. తాడేపల్లిగూడెం పట్టణానికి సంబంధించి వీకర్స్ కాలనీ ప్రాంతంలోనే నాలుగు హత్యలు జరిగాయన్నారు. సోమవారం జరిగిన హత్యతో అది ఐదుకు చేరిందని తెలిపారు. 30 వేల మంది మహిళలు అదృశ్యమయ్యారని గతంలో విమర్శలు చేసిన పవన్‌కళ్యాణ్.. అధికారంలోకి వచ్చిన తరువాత ఎంతమంది మహిళలను రక్షించారో చెప్పాలన్నారు. వరద బాధితులకు సహాయం అంటూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేరుతో కోట్లాది రూపాయలను వసూలు చేశారని.. ఆ సొమ్ములు కూటమి నేతలు పంచుకున్నారా? అని నిలదీశారు. వైఎస్సార్‌సీపీ నేతలు ముప్పిడి సంపత్‌కుమార్, కొలుకులూరి ధర్మరాజు, చెన్నా జనార్దనరావు, కర్రి భాస్కరరావు, బొద్దాని శ్రీనివాసు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థపై కుయుక్తులు

- కంప్యూటర్లు, యూపీఎస్‌లు, బ్యాటరీల మరమ్మతులపై శీతకన్ను
- పనిచేయని ప్రింటర్లతో సిబ్బంది అగచాట్లు
- నిర్వహణ ఖర్చులు పూర్తిగా నిలిపివేసిన వైనం
- పన్నుల ఆన్‌లైన్ పేరుతో సిబ్బందిపై ఒత్తిడి



ఏలూరు శనివారపు పేట వార్డు సచివాలయం

ఏలూరు (మెట్రో): సచివాలయ వ్యవస్థను నీరుగార్చేందుకు కూటమి సర్కారు కుయుక్తులకు పాల్పడుతోంది. గత ప్రభుత్వంలో ప్రజలకు ఎంతో సేవలందించిన ఈ వ్యవస్థను ప్రజల దూరం చేసేలా పావులు కదుపుతోంది. గత ప్రభుత్వంపై ఉన్న అక్కసుతో రూ.కోట్లు పెట్టికొనుగోలు చేసిన యంత్రాలపై కనీస దృష్టి కేంద్రీకరించకుండా మూలన పడేస్తున్నారు. అలాగే గ్రామ స్థాయిలో ప్రజలకు సేవలందించేందుకు ఏర్పాటు చేసిన సచివాలయాలకు కనీస అవసరాలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు సేవ చేయడంలో గ్రామ సచివాలయాలు ముందువరుసలో ఉండేవి. ప్రస్తుతం దీనికి విరుద్ధంగా పరిపాలన సాగుతుంది.

యంత్రాలు పనిచేయక ఇక్కట్లు : ప్రస్తుతం ఆ కంప్యూటర్లు మూలనపడుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,165 సచివాలయాల యూపీఎస్‌లు పూర్తిగా పనిచేయకుండా పోయాయి. సచివాలయాలకు అందించే ఇంటర్నెట్ సదుపాయం కేవలం ఒక కంప్యూటర్‌కు మాత్రమే అందించేందుకు కూటమి సర్కారు చర్యలు తీసుకుంది. ప్రింటర్లు, ప్రింటర్లలో ఉపయోగించే టోనర్లు సైతం సరిగా పనిచేయడం లేదు. దీంతో సచివాలయంలో పని చేయాలంటే సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.అరకొర వసతులతోనే నెట్టుకొస్తున్న సచివాలయ సిబ్బందికి గోరుచుట్టుపై రోకలిపోటు అన్న చందంగా ఇటీవల ప్రవేశపెట్టిన 'స్వర్ణ పంచాయితీ' కార్యక్రమం తయారైంది. ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని సచివాలయ సిబ్బందికి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పనిచేయని కంప్యూటర్లతో రెండు రోజుల్లో ఆయా సచివాలయాల పరిధిలోని ఇంటి పన్నులు ఆన్‌లైన్ చేయాలని ఆదేశించడంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

ఈ–సర్వీస్ అకౌంట్ ఎత్తివేత

గతంలో ప్రవేశపెట్టిన ఈ– సర్వీస్ అకౌంట్స్ సైతం సచివాలయ కార్యదర్శులకు అందుబాటులో లేకుండా కూటమి సర్కారు చర్యలు తీసుకుంది. ఈ అకౌంట్ ద్వారా సచివాలయంలో కనీస సదుపాయాల కల్పనకు రూ. 1000 నుంచి 2 వేలు, 5 వేల వరకు కార్యదర్శులు ఖర్చు పెట్టుకునే సదుపాయం ఉండేది. ఈ నిధుల ద్వారా కంప్యూటర్లు, ప్రింటర్లు, యూపీఎస్‌లు వంటి వాటి మరమ్మతులను చేయించుకునే వెసులుబాటు కార్యదర్శులకు కలిగేది. ప్రస్తుతం ఈ సర్వీసు అకౌంట్ తొలగించడంతో కనీస నిధులు సైతం సచివాలయానికి అందడం లేదు.

గత ప్రభుత్వం కేటాయించిన సామగ్రి

గతంలో సచివాలయాలకు అందించిన సామగ్రిని పరిశీలిస్తే 2,330 కంప్యూటర్లు, 1,165 యూపీఎస్‌లు, 2,814 యూపీఎస్ బ్యాటరీలు, 1,165 యూపీఎస్ స్టాండ్స్, 1,165 ప్రింటర్లు, 1,165 లామినేషన్ మిషన్లు, 19,144 బయోమెట్రిక్ డివైజ్‌లు, 18,795 మొబైల్ ఫోన్లు, 18,202 సిమ్ కార్డులు, 1,165 ఐరిస్ స్కానర్లతో పాటు కుర్చీలు, టేబుల్స్ వంటివి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయాలకు అందించింది. ప్రస్తుతం వీటిలో సగానికి పైగా మూలకు చేరాయి.

ఉమ్మడి జిల్లాలో 1,165 సచివాలయాలు

ప్రజలకు సేవలందించేందుకు వైఎస్సార్‌సీపీ సర్కారు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,165 సచివాలయాలు ఏర్పాటు చేసింది. ఈ సచివాలయాల ద్వారా 142 సేవలను అందించేందుకు చర్యలు తీసుకున్నారు. 938 గ్రామ సచివాలయాలు, 227 వార్డు సచివాలయాల్లో 8,468 మంది సచివాలయ సిబ్బందితో పాటుగా పంచాయతీ కార్యదర్శులను సైతం కేటాయిస్తూ చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,165 గ్రామ, వార్డు సచివాలయాల్లో 9,099 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, సిబ్బంది కార్యదర్శికి అందుబాటులో ఉండేవారు. వెల్ఫేర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్‌కు ప్రత్యేకించి కంప్యూటర్లను సైతం కేటాయించారు. ప్రతి సచివాలయానికి రెండు కంప్యూటర్లు ఏర్పాటు చేశారు. ఆయా కంప్యూటర్లకు ఇంటర్నెట్ సదుపాయం సైతం కల్పించారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించేందుకు ప్రజల డేటాను నమోదు చేయించి ప్రభుత్వ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు తీసుకునేవారు.

నూతన ఆవిష్కరణలు చేయాలి

కలెక్టర్ నాగరాణి



గూడెం పాలిటెక్నిక్ కళాశాలలో ప్రాజెక్టులను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

పెంటపాడు: శాస్త్ర, సాంకేతిక రంగాలలో పెరుగుతున్న పోటీకి అనుగుణంగా మన విద్యార్థులు నూతన అవిష్కరణలు చేయాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి పేర్కొన్నారు. గూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని 11 పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు రెండు రోజుల పాలిఫెస్ట్–24 కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ సంయుక్త సంచాలకుడు జె. సత్యనారాయణమూర్తి, జిల్లా పాలిటెక్నిక్ కళాశాలల కోఆర్డినేటర్ ఎస్.ఫణీంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలతో పాటు, ఉపాధ్యాయులు కూడా ప్రత్యేక ప్రోత్సాహాన్ని అందించాలన్నారు. రెండు రోజులు కార్యక్రమంలో భాగంగా తొలిరోజు జిల్లాలోని 11 పాలిటెక్నిక్ కళాశాలలకు సంబంధించి 123 మంది విద్యార్థులు తమ ప్రాజెక్టులను ఏర్పాటు చేశారు. ఈసీఈ, ఈఈఈ, కంప్యూటర్, మెకానికల్, సివిల్ తదితర విభాగాల నుంచి 49 ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. ఆర్డీవో కౌసర్ బానో పాల్గొన్నారు.

క్లుప్తంగా

నూజివీడులో దొంగల హల్‌చల్



వేలిముద్రలను సేకరిస్తున్న క్లూస్ టీం

నూజివీడు: పట్టణంలో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. గత వారం రోజుల్లో మూడు దొంగతనాలు, ఒక చైన్‌స్నాచింగ్ జరగడంతో పట్టణ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. నూజివీడులోని ఎంప్లాయిస్ కాలనీలో సోమవారం అర్ధరాత్రి కూడా ఓ చోరీ జరిగింది. ఎల్ఐసీ ఆఫీసు రోడ్డులో ఉంటున్న కొల్లు బంగారమ్మ పది రోజుల క్రితం ఇంటికి తాళం పెట్టి అమెరికాలోని కొడుకుల వద్దకు వెళ్లింది. మంగళవారం ఉదయం 8 గంటలకు పనిమనిషి వచ్చి చూడగా తలుపులు తీసి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించగా వారు పరిశీలించారు. బీరువా తెరిచి అందులో ఉన్న సామాన్లు, దుస్తులు చిందరవందరగా పడి ఉండడాన్ని గుర్తించారు. ఇంటి యజమానురాలికి ఫోన్ చేయగా విలువైన వస్తువులు ఏమీ లేవని తెలపడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఏలూరు నుంచి క్లూస్ టీం వచ్చి వేలిముద్రలను సేకరించారు. కాగా ఇంటిలోకి దొంగ ప్రవేశించిన దృశ్యాలు సీసీ కెమేరాలో నిక్షిప్తమయ్యాయి.

లక్ష్యం మేరకు చేపనారు ఉత్పత్తి



గోదావరిలో చేప పిల్లలు వదులుతున్న దృశ్యం



బాదంపూడి మత్స్యకేంద్రం

- ఈ ఏడాది 4 కోట్ల చేప పిల్లల లక్ష్యం
- ప్రభుత్వం ఫామ్‌లకు సరఫరా

ఉంగుటూరు: చేపనారు ఉత్పత్తిలో రాష్ట్రంలోనే పేరొందిన బాదంపూడి ప్రభుత్వ మత్స్య కేంద్రంలో ఈ ఏడాది లక్ష్యం మేరకే చేపనారు ఉత్పత్తి చేశారు. అయితే ఈ కేంద్రాన్ని సిబ్బంది కొరత వెంటాడుతుంది. ఈ సమస్యను పరిష్కరిస్తే మేలైన చేప నారును ఉత్పత్తి చేసే అవకాశముంటుంది. ఈ ఏడాది జూన్ నుంచి సెప్టెంబరు వరకు బాదంపూడి ప్రభుత్వ మత్స్య కేంద్రం నుంచి కొవ్వలి ప్రభుత్వ ఫామ్‌కు 1.60 కోట్లు, నర్సాపురం చేపల ఫామ్‌కు 20 లక్షలు, కృష్ణా జిల్లా పెనమలూరు ప్రభుత్వ ఫామ్‌కు 10 లక్షలు, మోటూరు ఫామ్‌కు 35 లక్షలు, దర్శి ఫామ్‌కు 30 లక్షలు, ఏలూరు ఫామ్‌కు 5 లక్షలు సరఫరా చేశారు. 1.39 కోట్ల చేపనారుని బాదంపూడి కేంద్రంలో నిల్వచేశారు. ఇందులో 20 లక్షల చేపపిల్లలు అందుబాటులోకి వచ్చాయి.

ప్రైవేటు రైతులు, ఫిషర్‌మెన్ సొసైటీలకు సరఫరా

1978లో ఈ మత్స్య కేంద్రాన్ని స్థాపించారు. ఇక్కడ తయారైన చేపనారుని ప్రభుత్వ కేంద్రాలకు సరఫరా చేయడంతో పాటు ప్రైవేటు రైతులకు, ఫిషర్‌మెన్ సొసైటీలకు సరఫరా చేస్తుంటారు. ఇక్కడ తయారైన చేప నారు ఇతర జిల్లాలకు కూడా సరఫరా చేస్తారు. కట్ల, రాహు, మిగ్రాల వంటి రకాలను ఇక్కడ ఉత్పత్తి చేస్తారు.

కేంద్రంలో సిబ్బంది కొరత

బాదంపూడి మత్స్య కేంద్రంలో సిబ్బంది కొరత వెంటాడుతోంది. ఫిషరీస్ ఇన్‌స్పెక్టరు పోస్టు ఖాళీగా ఉంది. ఫీల్డ్‌మెన్‌లు పోస్టు ఒకటి ఖాళీగా ఉంది. ఫిషర్‌మెన్‌లు పోస్టులు 3 ఖాళీగా ఉన్నాయి. దాంతో సిబ్బంది కొరత కేంద్రాన్ని వెంటాడుతోంది.

14.06 ఎకరాల్లో మత్స్యకేంద్రం

1978లో ఏర్పడిన ఈ చేపల కేంద్రం జాతీయ రహదారికి ఆనుకుని 14 ఎకరాల్లో విస్తరించి ఉంది. మత్స్యశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు చేప నారు ఎంత ఉత్పత్తి చేయాలనేది ఏటా నిర్ధేశిస్తారు. దానికి అనుగుణంగా ఉత్పత్తి చేస్తుంటారు. ఏటా జూన్ మూడో వారం నుంచి వాతావరణం అనుకూలిస్తుంది. అప్పటి నుంచి సెప్టెంబరు వరకు ఉత్పత్తి చేస్తుంటారు. కేంద్రంలోని చైనీస్ టైపు హేచరీలో తల్లి చేపలను విడుదల చేస్తారు. ఆడ మగ చేపలకు హార్మోన్ ఇంజెక్షన్లు ఇస్తారు. కేంద్రంలో చేపనారు పెంచితే 20 రోజులకు 25 ఎంఎం చిరుచేప తయారవుతుంది. ఈ చిరు చేపపిల్లను కేంద్రంలో ఇతర సహజ సిద్ధ స్టాకు నిల్వ చేసే కుండీల్లో వేసి ఉంచుతారు.

ప్రభుత్వం దృష్టికి సిబ్బంది కొరత



మంచినీటి చెరువుల్లో మేలైన తల్లి చేపలు పెంచుకునేలా చేపపిల్లలను కేంద్రంలో తయారుచేసి అందిస్తాం. కేంద్రంలో ఖాళీగా ఉన్న పోస్టుల విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. తగినంత సిబ్బంది ఉంటే మేలైన చేపనారును ఉత్పత్తి చేయొచ్చు.

నర్సయ్య, మత్స్య కేంద్రం ఏడీప

సౌత్ జోన్ పోటీలకు స్వర్ణాంధ్ర విద్యార్థిని



విజేతలను అభినందిస్తున్న స్వర్ణాంధ్ర యాజమాన్యం

నరసాపురం రూరల్: టేబుల్ టెన్నిస్ సౌత్ జోన్ పోటీలకు స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని ఎంపికైంది. గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో జేఎన్‌టీయూ కాకినాడ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా జరిగిన టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో స్వర్ణాంధ్ర విద్యార్థినులు మహిళల విభాగంలో ద్వితీయస్థానం సాధించారు. కళాశాలకు చెందిన డి సునీత సౌత్ జోన్ జట్టుకు ఎంపికైంది. ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకూ చెన్నైలోని అమిత్ యూనివర్సిటీలో జరిగే సౌత్‌జోన్ టేబుల్ టెన్నిస్ పోటీల్లో ఆమె కాకినాడ తరుపున పాల్గొననుంది. ఈ సందర్భంగా క్రీడాకారిణులను చైర్మన్ కేవీ సత్యనారాయణ, కోశాధికారి త్రినాథ్, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, ప్రిన్సిపాల్స్ పండరీనాథ్, సురేష్‌కుమార్, ఎంబీఏ హెచ్‌వోడి గ్రేస్, ఫిజికల్ డైరెక్టర్ మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ గోపీచంద్, స్వామినాధన్, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

5న ఉన్నత పాఠశాలలకు సెలవు ప్రకటించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఈనెల 5వ తేదీన ఉమ్మడి తూర్పు పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు పోలింగ్ జరుగుతున్న నేపథ్యంలో ఉన్నత పాఠశాలలకు సెలవు ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి బీఏ సాల్మన్ రాజు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టీ. రామారావు, బీ.రెడ్డి దొర ఒక ప్రకటనలో కోరారు. ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వెళతారని, దీనివల్ల పాఠశాల నిర్వహణ సాధ్యం కాదన్నారు. ప్రత్యేక సెలవు మంజూరు వద్దని, ఉన్నత పాఠశాలలకు సెలవు ప్రకటించాలని డిమాండ్ చేశారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



వెంకటేశ్వరరావు (ఫైల్)

ఆకివీడు: విద్యుదాఘాతానికి గురై ఒక వ్యక్తి మృతి చెందాడు. ఆకివీడు మండలంలోని కుప్పనపూడి శివారు శివపార్వతీపురంలోని రొయ్యల చెరువు గట్టు వద్ద గడ్డి కోస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుత్ వైర్ తగిలి మాధుం వెంకటేశ్వరరావు(45) మృతి చెందినట్లు ఎస్సై హనుమంతు నాగరాజు మంగళవారం చెప్పారు. మృతుడి భార్య నాగ ధనలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

విలేకరిపై దాడి

కొయ్యలగూడెం: ఓ విలేకరిపై సోమవారం రాత్రి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. దీనిపై బాధిత విలేకరి మన్నే దుర్గబాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇటీవల కూటమి ప్రభుత్వానికి చెందిన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఒక ఎమ్మెల్యే చేస్తున్న అవినీతి అక్రమాలపై తమ ఛానల్లో ప్రసారం చేశామని తెలిపాడు. దీంతో సదరు ఎమ్మెల్యే తనపై కక్షగట్టి దాడి చేయించారని ఆరోపించాడు. ఈనెల 2వ తేదీ రాత్రి గోపాలపురం నుంచి కొయ్యలగూడెంకి బైక్‌పై వస్తుండగా పొగాకు వేలం కేంద్రం ఎదుట ముసుగు ధరించిన ఇద్దరు వ్యక్తులు తన మొహంపై కారం జల్లి దాడికి పాల్పడ్డారన్నారు. ఆ సమయంలో తాను కేకలు వేయడంతో అగంతకులు గోపాలపురం వైపు పారిపోయారని పేర్కొన్నాడు. అనంతరం మీడియా మిత్రుల సహాయంతో కొయ్యలగూడెం ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స తీసుకున్నట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీనిపై డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు మంగళవారం కొయ్యలగూడెం పోలీస్ స్టేషన్‌లో విచారణ చేపట్టారు.

కఠినంగా శిక్షించాలి

ఏలూరు (టూటౌన్): విలేకరిపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. జీ-తెలుగు న్యూస్ చానల్ విలేకరి గతంలో స్థానిక జనసేన ఎమ్మెల్యే చిర్రి బాలరాజుపై 'పవన్ మాటపై పట్టింపు లేని ఎమ్మెల్యే వసూళ్లకు దిగాడు' అనే వార్తను రాసినందుకు గాను అతడిపై దాడి జరిగినట్లు తెలిసిందన్నారు. ఇది పత్రికా స్వేచ్ఛ గొంతునొక్కే చర్యగానే చూడాలని తెలిపారు.

దోపిడీ దొంగల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ దుర్గా ప్రసాద్

నరసాపురం రూరల్: ఇటీవల ఒక వ్యక్తిపై దాడి చేసి దోపిడీకి పాల్పడిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు నరసాపురం రూరల్ సీఐ దుర్గాప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన తెలిపిన వివరాలివి. సుమారు మూడు నెలల కిత్రం మొగల్తూరు మండలం జగన్నాధపురం కోతుగుంట సమీపంలో ముసునూరి దుర్గారావు అనే వ్యక్తి బైక్‌ను ఆపి మూత్ర విసర్జన చేస్తుండగా, అతనిపై ట్రాన్స్‌జెండర్ జోషి, విగ్నేష్, రాయుడు రాజు దాడి చేసి సెల్‌ఫోన్, మోటార్ బైక్, రూ.22వేలు అపహరించారు. బాధితుడు దుర్గారావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మంగళవారం ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపర్చగా కోర్టు రిమాండ్ విధించినట్లు సీఐ దుర్గాప్రసాద్ తెలిపారు. విలేకరుల సమావేశంలో మొగల్తూరు ఎస్సైలు వాసు, నాగలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశోధనలకు పేటెంట్లను తెచ్చుకోవాలి



నిట్‌లో మాట్లాడుతున్న ఇవా కంపెనీ ఎండీ శ్రీనివాసు

తాడేపల్లిగూడెం: ఆవిష్కర్తలు పరిశోధనా పత్రాలకే పరిమితం కాకుండా వాటికి పేటెంట్లుగా మలుచుకునే స్థాయికి ఎదగాలని ఇవా ఐపీఅండ్ ఐటీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఎండీ శ్రీనివాసు మద్దిపాటి అన్నారు. మంగళవారం ఏపీ నిట్‌లో మేధోసంపత్తి హక్కులు–ఆవిష్కర్తల పేటెంట్లు అనే అంశంపై అవగాహన కార్యక్రమంలో శ్రీనివాసు మాట్లాడారు. ఆవిష్కర్తల మేధో సంపత్తికి వారి పరిశోధనలే కొలమానమన్నారు. పేటెంట్ అనేది ప్రభుత్వం అధికారికంగా మంజూరు చేసే హక్కు అన్నారు. ఆచార్యులు శాస్త్రి మాట్లాడుతూ పేటెంట్ల ద్వారా ఆవిష్కర్తల గొప్పతనం ప్రపంచానికి తెలుస్తుందన్నారు. ఇనిస్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ అధ్యక్షుడు డాక్టర్ పి.శంకర్, డాక్టర్ వి.సుదర్శన దీప, ఆచార్యులు ఫణికృష్ణ, కార్తికేయశర్మ, తదితరులు మాట్లాడారు. ఆచార్యులు, ఆవిష్కర్తలు పాల్గొన్నారు.

కారు ఢీకొని మోటార్‌సైక్లిస్టు మృతి



ఘటనా స్థలంలో నాగరాజు మృతదేహం

పెనుగొండ: కారు ఢీకొని ఓ మోటర్‌సైక్లిస్టు మృతి చెందాడు. ఎస్సై కే గంగాధరరావు తెలిపిన వివరాలివి. పాలకొల్లు మండలం దగ్గులూరుకు చెందిన దొడ్డి నాగరాజు (34) రాజమండ్రిలో రైసు మిల్లులో పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం విధుల నిమిత్తం రాజమండ్రికి మోటార్‌సైకిల్‌పై వెళుతుండగా పెనుగొండ మార్టేరు రోడ్డులో మార్టేరు వైపు వెళుతున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో నాగరాజు తలకు తీవ్ర గాయమవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతడికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. నాగరాజు భార్య దేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అంతర్రాష్ట్ర నేరస్తుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మొయిన్

అద్దంకి: అంతర్రాష్ట్ర నేరస్తుడిను పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో చీరాల డీఎస్పీ మొయిన్ వివరాలు వెల్లడించారు. కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలంలోని అంకంపాలెం గ్రామానికి చెందిన సాయి సూర్యతేజ రాత్రి సమయాల్లో షట్టర్లు పగులగొట్టి నగదు, ఇంజన్ ఆయిల్‌తో పాటు కార్లను దొంగిలిస్తుంటాడు. అతడిపై ఇప్పటికే విశాఖపట్నం, గుంటూరు, ఈస్ట్ గోదావరి, వెస్ట్ గోదావరి, నెల్లూరు, తిరుపతి, కుప్పం, రాజమండ్రి, చిత్తూరు, విజయవాడ ప్రాంతాల్లో 20 కేసులు నమోదు అయ్యాయి. ఇటీవల చిత్తూరు జైలు నుంచి విడుదలై అద్దంకితో పాటు పలు చోట్ల దొంగతనాలు చేశాడు. ఈ క్రమంలో సాయి సూర్యతేజ గుంటూరు పట్టణంలోని స్వప్నభారత్ నగర్‌కు చెందిన బెల్లంకొండ విజయ్‌కృష్ణతో కలసి గత నెల 25వ తేదీన అద్దంకిలోని శ్రీరామ్ ఏజెన్సీలో షట్టర్ పగులగొట్టి గల్లా పెట్టెలో ఉన్న రూ.15.30 లక్షలు చోరీ చేశారు. దుకాణ యజమాని గోపాల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు విచారణ చేపట్టిన పోలీసులు మంగళవారం అద్దంకి సమీపంలోని కొంగపాడు డొంక వద్ద నిందితులను అదపులోకి తీసుకున్నారు. రూ.18.48 లక్షల చోరీ సొత్తును రికవరీ చేశారు. ఎనిమిది కేసుల్లో సొత్తు రికవరీ కాగా, మరో ఐదు కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు డీఎస్పీ వివరించారు.

మోగల్లులో అపరిచిత మహిళ బురిడీ



అపరిచిత మహిళ

పాలకోడేరు: మోగల్లు గ్రామస్తులను ఓ అపరిచిత మహిళ బురిడీ కొట్టించి డబ్బులతో ఉడాయించిన ఘటన ఇది. వంద రూపాయలు కట్టండి.. వేల రూపాయల విలువైన టీవీ, ఫ్రిజ్, ఏసీ, డబుల్ కాట్ మంచం లాటరీలో గెలుచుకోండి అంటూ ఓ అపరిచిత మహిళ మోగల్లుకు వచ్చింది. ఇంకేముంది వస్తే వేలు.. పోతే వంద అనుకుని జనం ఎగబడి మరీ కట్టేశారు. తర్వాత మరో అంకానికి తెర తీసింది. మీకు టీవీ తగిలింది.. మీకు ఫ్రిజ్ తగిలింది.. మీకు మంచం తగిలింది.. అవన్నీ మా కంపెనీ నుంచి తీసుకు రావడానికి ఒక్కొక్కరికి మూడు వేలు అవుతుందంటూ ఒకరికి తెలియకుండా ఇంకొకరి నుంచి వసూలు చేసి ఉడాయించింది. ఈ విధంగా మోగల్లు గ్రామంలో 20 మంది వరకూ మోసపోయారు. ఇప్పుడు వారంతా గగ్గోలు పెడుతున్నారు. నాకు లాటరీ తగలిందంటే పింఛన్ డబ్బులు రూ.3 వేలు ఇచ్చి మోసపోయానని కె.దుర్గ లబోదిబోమంటోంది. ఐదు గంటలలోగా వస్తువులు ఇచ్చేస్తానంటే ఆశపడి రూ.3 వేలు కట్టానని మరో బాధితురాలు గోడి శ్రీలక్ష్మి వాపోయింది. బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి సమాయత్తం అయ్యారు.

క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించే వారిని ఎన్నుకోవాలి


తణుకులో ప్రచారం చేస్తున్న నాయకులు

తణుకు టౌన్ : విద్యా రంగంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అనుభవం ఉన్న డాక్టర్ గంధం నారాయణరావును గెలిపించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు కోరారు. మంగళవారం జరబోయే ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న నారాయణరావును గెలిపించాలని కోరుతూ తణుకులో ప్రచారం చేశారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, ఎస్టీయూ నాయకులు సీహెచ్‌జీవీ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

36 మద్యం సీసాల స్వాధీనం


మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్న ఎస్సై జేవీఎన్ ప్రసాద్

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మోదుగగుంట గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నేరంపై టపా శ్రీహరి నారాయణను పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 36 (180 మిల్లీ లీటర్ల) మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్సై జేవీఎన్.ప్రసాద్ మంగళవారం తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ప్రభుత్వ స్థలంలో బూడిద వేసిన వ్యక్తిపై కేసు

తాడేపల్లిగూడెం రూరల్: ప్రభుత్వ స్థలంలో ఊక బూడిదను వేయడంపై వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు రూరల్ ఏఎస్సై పీవీకే దుర్గారావు తెలిపారు. మంగళవారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రత్తిపాడు ట్రిబుల్‌ఎఫ్ నుంచి మారిశెట్టి అజయ్ అనే వ్యక్తి ఊక బూడిదను పెద్ద మొత్తంలో కొనుగోలు చేసి, దానిని ఎవరి అనుమతి లేకుండా తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఖాళీ స్థలంలో వేస్తున్నాడు. అంతే కాకుండా జాతీయ రహదారిపై వెళుతున్న వాహనదారులకు ఈ ఊక బూడిద వల్ల ఇబ్బంది కలగడంతో పాటు స్థానిక వ్యవసాయ భూమిలోని ఆకుమడి పాడవుతుందని వీఆర్వో దూలపల్లి శాంతకుమారి మంగళవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై దుర్గారావు తెలిపారు.

బెల్ట్ షాపులపై దాడి

నరసాపురం రూరల్: నరసాపురం ఎక్సైజ్ సర్కిల్ స్టేషన్ పరిధిలోని మొగల్తూరులో బెల్టు షాపులు నిర్వహిస్తున్న ఇరువురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 15 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ రాంబాబు తెలిపారు. మంగళవారం మొగల్తూరు మండలంలోని పేరుపాలెం గ్రామంలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న అడబాల వెంకటేశ్వరరావు, మొగల్తూరులో మోటుపల్లి నాగేశ్వరరావులను అదుపులోకి తీసుకుని వారిని మొగల్తూరు తహసీల్దార్ వద్ద బైండోవర్ చేశామన్నారు. వీరి నుంచి 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడుల్లో సీఐ రాంబాబుతోపాటు జిల్లా టాస్క్ ఫోర్స్ ఎస్సై రమాదేవి, ఎస్సైలు ఖాసిం, జైన్ లబిన్ పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: పెనుగొండలో బెల్ట్ షాపులు నిర్వహిస్తూ పట్టుబడిన ముగ్గురు వ్యక్తుల నుంచి 29 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తణుకు ఎక్సైజ్ సీఐ ఎస్.మణికంఠ రెడ్డి తెలిపారు. మంగళవారం నిర్వహించిన దాడుల్లో ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేయడంతో పాటు, వారి వద్ద నుంచి మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడుల్లో ఎస్సై బి.లక్ష్మి, హెడ్ కానిస్టేబుల్ కె.శ్రీనివాస్, వై.శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులను గౌరవించుకోవాలి


న్యాయవాది కల్పనను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: సమాజంలో సామాన్యులకు న్యాయం అందించడానికి న్యాయవాదులు కీలక పాత్ర వహిస్తున్నారని అలాంటి న్యాయవాదులను గౌరవించుకోవల్సిన బాధ్యత మనపై ఉందని ఆల్ బీసీ ప్రజాసంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నరమామిడి గంగారామ్ అన్నారు. మంగళవారం భీమవరంలో ప్రపంచ న్యాయవాదుల దినోత్సవం సందర్భంగా బీసీ సంఘాల లీగల్ అడ్వైజర్ సూరిశెట్టి కల్పనను సత్కరించారు. ఈ సందర్భంగా న్యాయవాది కల్పన మాట్లాడుతూ నిరుపేదలకు, సామాన్యులకు న్యాయం అందించడంలో కృషి చేస్తానని తెలిపారు.

అంధకారంలో వీవోఏలు

- వేధిస్తున్న మూడేళ్ల కాలపరిమితి
- పాలకపక్ష నేతల ఒత్తిళ్లతో సతమతం


సమస్యలు పరిష్కరించాలని వీవోఏల సమావేశం (ఫైల్)

తణుకు టౌన్: గ్రామాల్లో డ్వాక్రా సంఘాల మహిళలకు గ్రూపు నిర్వహణలో సహాయ సహకారాలు అందించే విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు (వీవోఏ)లు అంధకారంలో కొట్టిమిట్టాడుతున్నారు. ఈ ఉద్యోగులకు మూడేళ్ల కాలపరిమితి శాపంగా మారింది. దీనికి తోడు స్థానిక నేతల ఒత్తిళ్లతో వారు నిత్యం సతమతమవుతున్నారు. వీవోఏలు గ్రామాల్లోని డ్వాక్రా మహిళల్లో పొదుపు గ్రూపుల ఏర్పాటు, నిర్వహణ, బ్యాంక్ లావాదేవీల్లో సహాయ సహకారాలు అందించే వీవోఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఇటీవల తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించి ఆందోళన చేపట్టారు. కార్మికులు కాకుండా, ఉద్యోగులు కాకుండా మధ్యస్థంగా ఉన్న వీవోఏలకు పని భారం పెరిగిపోయిందని, వారికి పని ఒత్తిడి పెరగడమే కాకుండా మహిళా మార్టుల్లో వస్తువుల కొనుగోళ్లు చేయించడం తలకు మించిన భారంగా మారిందని ఆందోళన చెందుతున్నారు. వీవోఏలను ప్రతి మూడేళ్లకు మార్చేందుకు ఉద్దేశించిన సర్క్యులర్‌ను గత ఎన్నికల సమయంలో రద్దు చేస్తామని హామీ ఇచ్చిన కూటమి నాయకులు ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ సర్క్యులర్‌ను అమలు చేసేందుకు సిద్ధమైనట్లు వీవోఏలు పేర్కొంటున్నారు. నిర్దిష్టమైన పని గంటలు లేకుండా ఆదివారం, పండుగ సెలవులు లేకుండా పని చేస్తున్నా కనీస వేతనాలకు నోచుకోవడం లేదు.

ఎనిమిది నెలలుగా అందని జీతాలు

నెలకు రూ.8 వేలు మాత్రమే వేతనంగా ఇస్తున్నారు. ఇప్పటి వరకూ 8 నెలలుగా జీతాల్లేక ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 1500 మంది వీవోఏలు పని చేస్తున్నారని, అయితే ప్రస్తుతం 8 నెలలుగా వీవోఏలకు జీతాలు అందడం లేదు. డ్వాక్రా మహిళల రుణాలకు టార్గెట్‌లను నిర్ణయించి ఆమేరకు రుణాలు ఇప్పించడం, వాటిని తిరిగి బ్యాంక్‌లకు సకాలంలో చెల్లించేలా టార్గెట్‌లతో పని భారం పెరిగిపోయినట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీవోఏలకు ప్రభుత్వం ఇచ్చిన సెల్‌ఫోన్లు సరిగా పని చేయకపోవడంతో సొంతంగా కొనుగోలు చేసి వాటి ద్వారా ప్రభుత్వం ఇచ్చిన ఆన్‌లైన్ పనులు చేస్తున్నారని, ఈ పనులు కూడా ఒకటి పూర్తి కాకుండానే మరొకటి అప్పగించి పని ఒత్తిడి పెంచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటితో పాటు కొన్ని గ్రామాల్లోని వీవోఏలను కొంతమంది గ్రామ స్థాయి నాయకుల వేధింపులు పెరిగి ఉద్యోగాలను వదులుకోవడం, లేదా ఆత్మహత్యలు చేసుకునేలా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో ప్రభుత్వం మారడంతో అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో పలు గ్రామాల్లో వీవోఏలను తమకు నచ్చిన వారి కోసం బలవంతంగా ఉద్యోగాల నుంచి తప్పిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలి



గ్రామాల్లో డ్వాక్రా సంఘాలను బలోపేతం చేసే వీవోఏలకు ఇప్పటి వరకూ ఇవ్వలసిన వేతన బకాయిలను వెంటనే చెల్లించాలి. వీవోఏల ఉద్యోగ భద్రతకు, కనీస వేతనాలకు ప్రత్యేక చట్టం చేసి, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలి. వీవోఏలు కార్మికులు కాకుండా, ఉద్యోగులు కాకుండా ఉన్న వీరికి ఏదో ఒక చట్టం ప్రకారం వేతనాలు, విధి విధానాలు అమలు చేయాలి. పని ఒత్తిడి తగ్గించాలి.

– పీవీ ప్రతాప్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి

తొలగింపు నిర్ణయాన్ని విరమించుకోవాలి



మూడు సంవత్సరాల కాలపరిమితిని పూర్తి చేసుకున్న వీవోఏలను తొలగించాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకోవాలి. ప్రస్తుతం డీమార్ట్, రిలయన్స్ వంటి మల్టీ నేషనల్ కంపెనీల వస్తువులు అందుబాటులోకి వచ్చిన ఈ రోజుల్లో మహిళా మార్టుల్లోనే డ్వాక్రా మహిళలతో కొనుగోళ్లు పెంచే టార్గెట్‌లను తొలగించాలి. జిల్లా వ్యాప్తంగా తొలగించిన వీవోఏలను తిరిగి విధుల్లోకి తీసుకోవాలి.

– ఎ.నిర్మలాదేవి, జిల్లా అధ్యక్షురాలు, వీవోఏల అసోసియేషన్

బాల్య వివాహాలను అరికట్టాలి


మాట్లాడుతున్న సూపర్‌వైజర్ దుర్గాభవాని

తాడేపల్లిగూడెం (టీఓసీ): బాల్య వివాహాలను అరికట్టేందుకు, చైల్డ్ లేబర్‌ను నిరోధించేందుకు కృషి చేద్దామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దుర్గా భవాని పిలుపునిచ్చారు. 35 వార్డుల నుంచి వచ్చిన డబ్ల్యూపీఎస్, ఆర్పీ, అంగన్‌వాడీ కార్యకర్తలకు అర్బన్, జిల్లాస్థాయి శిక్షణను ట్రైనింగ్ మాస్టర్లు అందజేశారు. మెప్మా సీఎంఎం శ్రీనివాస్, డాక్టర్ శ్రావ్య, మంగతాయారు, జిల్లా లెవెల్ ట్రైనింగ్ మాస్టర్స్ కల్పన, విజయ కుమారి, విజయలక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఆరు నుంచి రెవెన్యూ సదస్సులు

ఆకివీడు: ఈ నెల ఆరో తేదీ నుంచి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. గ్రామాల్లో భూములకు సంబంధించిన సమస్యలు, పట్టాదారు పాస్ పుస్తకాలు, సర్వే, టైటిల్‌డీడ్, రైతు సంఘాల వినతులు స్వీకరించి, ప్రజల వినతులను పరిష్కరిస్తామన్నారు. జనవరి 8వ తేదీ వరకూ సదస్సులు జరుగుతాయని తహసీల్దార్ వివరించారు.

కిశోర బాలికలకు చట్టాలపై అవగాహన తప్పనిసరి


మాట్లాడుతున్న సీడీపీఓ ప్రమోదకుమారి

అత్తిలి: కిశోర బాలికలు చట్టాలపై అవగాహన కలిగి, ఆత్మరక్షణ కోర్సులను నేర్చుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ పి.ప్రమోదకుమారి చెప్పారు. మంగళవారం అత్తిలి మండల పరిషత్ కార్యాలయంలో కిశోరి వికాసం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీడీపీఓ మాట్లాడుతూ 11–18 సంవత్సరాల వయస్సు గల బాలికలను కిశోరి బాలికలుగా పిలుస్తారన్నారు. క్షేత్రస్థాయిలో బాల్య వివాహాలపై అవగాహన, పోక్సో చట్టం, లైంగిక వేధింపులు, లింగ వివక్షత, ఋతుక్రమం పరిశుభ్రత, అక్రమరవాణా, ఆత్మ రక్షణకు కోర్సులు, నైపుణ్యం వాటిపై ఆమె అవగాహన కల్పించారు. ఉపాధ్యాయినులు మాధురి, పుష్పలత మాట్లాడుతూ సోషల్ మీడియా మాధ్యమాలు పిల్లలకు అభ్యంతరకరంగా ఉంటున్నాయని, ఇన్‌స్టాగామ్ ద్వారా తెలియని వ్యక్తులతో చాటింగ్ చేయడం వల్ల అనేక పరిణామాలకు దారి తీస్తున్నాయన్నారు. తల్లిదండ్రులు నిత్యం పిల్లలను గమనిస్తూ ఉండాలని, కుటుంబ వ్యవస్థ బాగుండాలని తెలిపారు. ఎంపీడీవో సామ్యూల్ మాట్లాడుతూ బాలికలను రక్షించండి-బాలికలను చదివించండి అనే నినాదంతో సమాజంలో అందరూ బాధ్యత వహించాలన్నారు. బాల్య వివాహంపై నాటిక ప్రదర్శన ఇచ్చారు. ఐసీడీసీఎస్ సూపర్‌వైజర్లు ఎం.శ్రీదేవి పోక్సోచట్టం, బాల్యవివాహ నిరోధకచట్టాలపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ కె.కుమారి మాట్లాడుతూ పిల్లలకు ఫోన్లు ఇచ్చినా నిరంతరం తల్లిదండ్రులు పర్యవేక్షించాలన్నారు. బీపీసీ శ్రీకాంత్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా సంరక్షణ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎలక్షన్ కోడ్ ముగియగానే కల్వర్టు నిర్మాణం

సాక్షి స్పందన


ప్రమాదకరంగా ఉన్న మలుపు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మున్సిపల్ కార్యాలయం మీదుగా మసీద్ సెంటర్ వైపుకు తిరిగే రోడ్డు మలుపువద్ద ప్రధాన డ్రెయిన్‌కు ప్రమాదకరంగా మారిందని, వన్‌టౌన్‌లోని ఓవర్‌బ్రిడ్జి డౌన్ మెట్లు ల్యాండింగ్ సమీపంలో మున్సిపల్ కార్యాలయం మీదుగా ప్రధాన డ్రైయిన్‌కు రాడ్లను ఏర్పాటు చేసి మెస్ నిర్మించే విషయంలో అధికారులు పట్టించుకోకపోవడంతో ఆ మార్గంలో ప్రయాణించే వారు ఇబ్బందులు పడుతున్నారని, పురపాలక సంఘం అధికారులు తక్షణమే మలుపు వద్ద రక్షణ ఏర్పాట్లు చేయాలని కోరుతూ ఆ మలుపు ప్రమాదాలకు పిలుపు అనే శీర్షికతో సాక్షిలో కథనం వెలువడింది. దీనిపై మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు స్పందించారు. స్థానిక పదో వార్డులో మున్సిపల్ కారాయలయం నుంచి మసీదు సెంటర్ వైపు తిరిగే రోడ్డు మలుపు వద్ద ప్రధాన కల్వర్టు దెబ్బతింది. దీని పునర్నిర్మాణ పనుల నిమిత్తం రూ.10 లక్షలతో అంచనాలు తయారు చేశామన్నారు. ప్రస్తుతం ఈ పనులు టెండర్ ప్రక్రియలో ఉన్నాయని, ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో టెండర్ పనులు తాత్కాలికంగా ఆగినట్లు వెల్లడించారు. ఎన్నికల కోడ్ ముగియగానే టెండర్ పిలిచి ఆమోదం పొందిన వెంటనే పనులు మొదలు పెడతామని వివరించారు.

13న గూడెం మండల పరిషత్ సమావేశం

తాడేపల్లిగూడెం రూరల్: మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఈ నెల 13న ఉదయం 10 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ పానుకుమాటి శేషలత అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

మరమ్మతు పనులు వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ నాగరాణి


వసతి గృహాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

పెంటపాడు: మండలంలోని పరిమెళ్ల సాంఘిక సంక్షేమ వసతి గృహ మరమ్మతు పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ పరిమెళ్ల వసతి గృహాన్ని పరిశీలించారు. విద్యార్థుల టాయిలెట్లను, వంటగదిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మరమ్మతు పనులను పూర్తి చేయడానికి ప్రతిపాదనలు పంపాలని హౌసింగ్ పీడీ పిచ్చయ్యను ఆదేశించారు. కాగా విద్యార్థులకు సౌకర్యాలు అందించేందుకు వీలుగా దాతలను సమకూర్చుకోవాలన్నారు. అనంతరం స్థానిక జెడ్పీ స్కూలును సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం నందూరి సూర్యచంద్రరావు అందించిన మొక్కలను ఆమె నాటారు. సర్పంచ్ గొర్రెల కోటేశ్వరరావు, ఉపసర్పంచ్ నాగరాజు, ఎంపీడీవో బాలాజీ, తహసిల్దార్ ఏడిద శ్రీనివాస్, జిల్లా సాంఘీకసంక్షేమ అధికారి శోభారాణి, వసతిగృహ నిర్వాహకులు రామకృష్ణ, ఏఎస్‌డబ్ల్యూ రామలింగం, వీఆర్వో బండి పద్మ, కార్యదర్శి నాగదేవి, తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ పనులు వేగవంతం చేయాలి

పరిమెళ్ల లాకుల నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా పలు మండలాలకు తాగునీరందించే ప్రక్రియను అధికారులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె చిలకంపాడు-పరిమెళ్ల గ్రామాలకు మధ్య ఉన్న వెంకయ్య కాలువను పరిశీలించారు. గతంలో ప్రతిపాదించిన తాగునీటి పథకాన్ని పునరుద్ధరించే ప్రక్రియలో భాగంగా కలెక్టర్ అక్కడ మ్యాప్ ఆధారంగా ఎస్‌ఎస్ ట్యాంకులకు మంచి నీటి సరఫరా జరిగే ప్రాంతాలను పరిశీలించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి నాగేశ్వరరావు, తహసిల్దార్ వై. శ్రీనివాసరావు, ఎంపీడీవో బాలాజీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

బెదిరింపులపై ఫిర్యాదు

భీమవరం: తన కుటుంబంపై అసత్యవార్తలు ప్రచారం చేస్తూ న్యూడ్ ఫోటోలను సోషల్ మీడియాలో పెట్టిన వ్యక్తులతో మాట్లాడడానికి వెళ్లగా చంపుతామని బెదిరించినట్లు భీమవరం పట్టణానికి చెందిన గూడూరి మనోజ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు భీమవరం వన్‌టౌన్ సీఐ ఎం.నాగరాజు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం మనోజ్ కుమార్‌తో తణుకు పట్టణానికి చెందిన శిరీషకు వివాహమైంది. 2019లో మనస్పర్థలతో విడిపోయారు. 2024 ఏప్రిల్‌లో శిరీష, గుత్తుల వెంకటేశ్వరరావు మనోజ్ కుమార్ కుటుంబంపై న్యూడ్ ఫోటోలను సోషల్ మీడియాలో పెట్టడంతో దానిపై మాట్లాడడానికి తణుకు వెళ్లగా శిరీష, వెంకటేశ్వరరావు అసభ్య పదజాలంతో దూషించి చంపుతా మని బెదిరించారు. సమస్యను పెద్దల్లో పెట్టినప్పటికీ పరిష్కారం కాకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు.

అసిస్టివ్ టెక్నాలజీ ల్యాబ్ అభినందనీయం


భీమవరం విష్ణు కళాశాల విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న దృశ్యం

భీమవరం: వికలాంగులకు ఉపయోగపడే విధంగా భీమవరం విష్ణు ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టివ్ టెక్నాలజీ ల్యాబ్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రముఖ నేత్రవైద్యుడు, యువీఎస్ మెమోరియల్ టెస్ట్ సెంటర్ ఫర్ విజువల్లీ ఛాలెంజ్ వ్యవస్థాపకుడు డాక్టర్ యువీ రమణరాజు అన్నారు. మంగళవారం విష్ణు ఇంజనీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అసిస్టివ్ టెక్నాలజీ ల్యాబ్‌లో విద్యార్థులు చేపడుతున్న వివిధ పరిశోధనలు, ల్యాబ్‌లో వికలాంగులకు చేయూతనిచ్చే పరికరాలను తయారు చేయడం ప్రశంసనీయమన్నారు. అనంతరం అసిస్టివ్ టెక్నాలజీ ల్యాబ్‌లో విద్యార్థులు తయారు చేసిన వివిధరకాల పరికాలను ప్రదర్శించి ఉత్తమ ప్రదర్శన కనబర్చిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మంగం వేణు, వైస్ ప్రిన్సిపల్ ఎం.శ్రీలక్ష్మి, అసిస్టివ్ టెక్నాలజీ ల్యాబ్ కోఆర్డినేటర్ గాయత్రిశర్మన్, ఈసీఈ విభాగాధిపతి కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో సాగాలి


తణుకు అర్బన్: దివ్యాంగ చిన్నారులకు బహుమతులు అందిస్తున్న ఎంఈవో హైమావతి


పెంటపాడు: విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, ఎంఈవోలు


తాడేపల్లిగూడెం (టీఓసీ): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: దివ్యాంగులు ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకుని ఒక లక్ష్యంతో ముందుకు నడవాలని తణుకు మండల విద్యాశాఖాధికారి వి.హైమావతి అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం తణుకు నెంబర్ వన్ మున్సిపల్ పాఠశాలలోని భవిత కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన దివ్యాంగ విద్యార్థులకు పండ్లు, ఆటల పోటీల్లో గెలిచినా వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎస్.హరిబాబు, జెడ్పీ బాయ్స్ హైస్కూలు హెచ్‌ఎం కె.పద్మావతి, సత్తి సుధీర్ కుమార్‌రెడ్డి, భవిత కేంద్ర ఉపాధ్యాయులు కేవీసీ శేఖర్‌బాబు, వానపల్లి పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో..

దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక భవిత కేంద్రంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ విద్యాంగులకు చట్టంలో కొన్ని ప్రత్యేక హక్కులు పొందుపరచబడి ఉన్నాయన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు కౌరు వెంకటేశ్వర్లు, కోలా కనకదుర్గ భవాని, ఎ.అజయ్‌కుమార్, పారా లీగల్ వలంటీర్లు కె.నాగమల్లేశ్వరి, శ్రీదేవి పాల్గొన్నారు.

దివ్యాంగులను ప్రోత్సహించాలి

పెంటపాడు: దివ్యాంగులను ప్రతి ఒక్కరూ అక్కున చేర్చుకుని ఆదరించాలని ఎంఈవోలు టీవీ రామకృష్ణ, ఎం.శ్రీనివాస్ పేర్కొన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం పెంటపాడు ప్రభుత్వ పోస్టుబేసిక్ స్కూలు వద్ద ఐఈడీ ఉపాధ్యాయిని ఎం.సాయి స్వరూప ఆధ్వర్యంలో విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేసి వారికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల ఐఈడీ ఉపాధ్యాయిని షేక్ మస్తాన్‌బీ, సీఆర్‌పీలు చిట్టెమ్మ, రాజు, బాలు, వాసు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభను గుర్తించాలి

దివ్యాంగుల ప్రతిభను ప్రతి ఒక్కరూ తప్పక గుర్తించాలని మానవత జిల్లా నాయకులు, పర్యావరణ పరిరక్షణ కమిటీ అధ్యక్షులు తాడేపల్లి మోహనరావు పేర్కొన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం పెంటపాడు భవిత కేంద్రం వద్ద విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేసి వారికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఎంఈవోలు టీవీ రామకృష్ణ, ఎం. శ్రీనివాస్. మండల ఐఈడీ ఉపాధ్యాయిని షేక్ మస్తాన్ బీ. సీఆర్‌పీలు చిట్టెమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ధ్రువ పత్రాల అందజేత

ఎంఈవోలు పలువురు దివ్యాంగ విద్యార్థులకు ధ్రువ పత్రాలు అందించారు. వారు పరీక్షల్లో ఉత్తీర్ణులు అయ్యేందుకు కృషి చేసిన విలీన ఉపాధ్యాయిని సాయి స్వరూపను ప్రత్యేకంగా అభినందించారు.

దివ్యాంగులకు అండగా లయన్స్ క్లబ్

తాడేపల్లిగూడెం (టీఓసీ): దివ్యాంగులకు అండగా లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్స్ ఉంటుందని క్లబ్ జిల్లా కో-ఆర్డినేటర్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు పేర్కొన్నారు. స్థానిక సుబ్బారావుపేట దివ్యాంగుల పాఠశాల (భవిత సెంటర్)లో మంగళవారం ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఎంఈఓ హనుమ హాజరై మాట్లాడారు. కేక్ కటింగ్, విజేతలకు సర్టిఫికెట్స్, డ్రాయింగ్ బుక్స్, బిస్కెట్స్, పెన్సిల్స్, నోట్ పుస్తకాలు, పలకలు, ఇతర విద్యా సమాగ్రి అందజేశారు. దివ్యాంగ పిల్లలకు సేవలు అందిస్తున్న బి.నాగలక్ష్మిని సత్కరించారు. నార్ని వెంకట కృష్ణారావు, చిన్ని, చెన్నారెడ్డి సతీస్, సాయిరాం, మామిడిశెట్టి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

లోపాలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

భీమవరం: ధాన్యం కొనుగోళ్లలో ఏ విధమైన లోటుపాట్లు లేకుండా త్వరితిగతన పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి జిల్లాలోని రెవెన్యూ సిబ్బందితో ధాన్యం కొనుగోళ్లపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటివరకు జిల్లాలో 248 రైతు సేవా కేంద్రాల ద్వారా 1.72 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యంను కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతు ఖాతాలో డబ్బులు ప్రభుత్వం జమ చేస్తుందని అన్నారు. దీనికి సంబంధించి రూ.390 కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉండగా రూ.383 కోట్లు రైతులు ఖాతాల్లో జమ చేశామని అన్నారు. ధాన్యం సేకరణ వేగవంతం చేయాలని మండల స్థాయి అధికారులు ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌ఓ మొగలి వెంకటేశ్వర్లు, జిల్లా గ్రామ వార్డు సచివాలయం అధికారి వై.దోసి రెడ్డి, సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ టి.శివరాం ప్రసాద్, డీఎస్‌ఓ ఎన్. సరోజ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా సర్వే అధికారి కె.జాషువా తదితరులు పాల్గొన్నారు.